
# చిన్నారి అతిథి

## రంగుడు శివరామకృష్ణ శర్మ



"ఎవరి అబ్బాయివి బాబూ!" అడగాడు వెంకట్రావు.

మధ్యాహ్నం బస్సులోంచి దిగుతుంటే చూశాడు ఆ కుర్రాడ్ని. తర్వాత తన పనుల్లో మునిగి పట్టించుకోలేదు. మళ్ళీ గమనించేసరికి కుర్రాడింకా అక్కడే ఉన్నాడు. వెంకట్రావు ప్రశ్నకు జవాబివ్వకుండా బెరుగ్గా అతన్నే చూస్తున్నాడు.

"ఏ ఊరు?" అడిగాడు వెంకట్రావు. ఆ ఊర్లో ఎప్పుడూ ఆ కుర్రాడ్ని చూడలేదు. అదీ కాక బస్సులోంచి ఒంటరిగానే దిగాడు.

ఈసారి కూడా కుర్రాడి నుంచి సమాధానం లేదు.

"నీ పేరేంటి?"

"రాజు" అన్నాడు తల దించుకుని.

"మీ ఇల్లెక్కడ?" అడిగాడు వెంకట్రావు.

ఎనిమిదే ళ్ళుంటాయి రాజుకు. ఖరీదైన బట్టలు, అమాయకమైన ముఖం. కళ్ళలో లీలగా కదలాడుతున్న దైన్యం.

"ఎంకట్రావు! అక్కడేం చేస్తున్నావ్‌బే! బస్సొచ్చేసింది సూడు!" రిక్షావాడు అరిచాడు వెనుకనుండి.

"ఇక్కడే నిలబడు. వస్తాను" అని కదిలాడు వెంకట్రావు - 'ఎవరింటికో వచ్చి దారి తెలీక అవస్థపడుతున్నాడేమో! - పని చూసుకుని అతని తాలూకు వాళ్ళకి అప్పగించేస్తే, సరిపోతుంది' అనుకున్నాడు.

బస్టాండు రద్దీగా ఉంది. ప్రయాణీకులు హడావుడిగా కదులుతున్నారు. వెంకట్రావు ఆ బస్టాండులో మోత కూలీ. వయస్సు నలభై అయిదేళ్ళు దాటి ఉంటుంది.

బస్సులోకి సామాన్లు ఎక్కించి వచ్చాడు వెంకట్రావు. ఇంకా కుర్రాడు అక్కడే ఉన్నాడు.

"చుట్టాలింటికి వచ్చావా?" అన్నాడు రాజుతో.

అడ్డంగా తలుపాడు రాజు.

ఏం చేయాలో తోచలేదు వెంకట్రావుకు. ఎదురుగా నిలబడ్డ ఆ కుర్రాడు పేరు తప్ప ఇంకొకటి చెప్పడని మాత్రం అర్థమయింది. పొరపాటున తనవాళ్ళను వదిలేసి బస్సులోంచి

దిగిపోయి ఉంటాడు. వాళ్ళు వెతుక్కుంటూ వస్తారేమో!

చీకటి క్రమంగా ఆవరిస్తోంది. వీధి లైట్లు కళ్ళు తెరుచుకుని వెలుగు చూపిస్తున్నాయి.

అంతకుముందు వెళ్ళిందే ఆఖరి బస్సు. మర్నాటి ఉదయం వరకూ ఆ పల్లెటూరికి ఇం కే బస్సూ రాదు.

"ఆక లేస్తోంది!" అన్నాడు రాజు స్వగతంలో అనుకుంటున్నట్లు.

జేబులు తడుముకున్నాడు వెంకట్రావు. ఆ రోజు సంపాదించిన చిల్లర వది రూపాయలు దాటి ఉంటుంది.

"పద బాబూ!" అన్నాడు పక్కనే ఉన్న హోటల్ వైపు నడుస్తూ.

రాజు అతన్ని అనుసరించాడు.

భోజనం చేస్తూ అడిగాడు వెంకట్రావు మళ్ళీ - "ఏ ఊరు బాబూ మీది?" అని.

"విశాఖపట్నం."

"ఈ ఊరు ఎందుకొచ్చావు? మీ అమ్మను, నాన్నను వదిలేసి బస్సు దిగిపోయావా?"

"ఉహుఁ!" అన్నాడు రాజు.

"మరి ..."

"ఇంట్లోంచి పారిపోయి వచ్చేశాను."

తింటున్న వెంకట్రావు ఉలిక్కిపడ్డాడు. కుర్రాడ్ని పరీక్షగా చూశాడు.. రాజు తలవంచుకుని తింటున్నాడు. ఎనిమిదేళ్ళ వయసున్న ఆ కుర్రాడు ఇంట్లోంచి పారిపోయి వచ్చాడా? అతని కెందుకో నమ్మకం కుదరడంలేదు. గొప్పింటివాడిలా ఉన్నాడు. ఎందుకు వచ్చేశాడు? దొంగతనం చేశాడా? అలిగి ఇంట్లోంచి వచ్చేశాడా? ఎందుకు?

"ఎందుకు వచ్చేశావు?" అడిగాడు.

"మమ్మీ, డాడీ కొట్టారు" అన్నాడు రాజు. గతం తలచుకోవడం వల్ల వచ్చిన దుఃఖంతో వాడి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

ఏడుస్తున్న రాజును సముదాయిస్తూ "ఎందుకు కొట్టారు?" అడిగాడు వెంకట్రావు.

"మా పక్కింటి సీనుగాడికి నా కన్నా ఒక మార్కుఎక్కు వొచ్చింది! ప్రతిసారి నేనే మా క్లాసు ఫస్టు! ఈ సారి రాలేదని మమ్మీ, డాడీ కొట్టారు! అందుకని వచ్చేశాను" అన్నాడు రాజు వెంకట్రావు, సముదాయింపుతో మరింతగా ఏడుస్తూ.

"ఊరుకో బాబూ! అన్నాడు వెంకట్రావు. "ఇలా వచ్చేస్తే మీ అమ్మా, నాన్నా బాధపడరూ!"

"నీకు తెలీదు! వాళ్ళు మంచివాళ్ళు కాదు! ఎప్పుడూ నన్ను తిడుతూ ఉంటారు. నే నింక అక్కడికి వెళ్ళను" అన్నాడు రాజు నిశ్చయంగా.

మరిం కేం మాట్లాడలేదు వెంకట్రావు. ఆ కుర్రాడ్ని చూస్తే అతనికి జాలేస్తోంది. ఇల్లు వదిలి వచ్చేశాడంటే ఎంత బాధ అనుభవించాడో మళ్ళీ ఆ ఇంటికి వెళ్ళ ననడం వెనుక ఎన్ని రోజుల వేదన ఉందో అతనికి కొంచెం అర్థమైంది. కొంతసేపయ్యాక రాజుతో అన్నాడు - "తప్పు బాబూ! అలా అనకూడదు! రేపు మీ ఇంటికి దిగబెడతాను. మీ నాన్నగారికి చెప్తాన్లే! ఇం కెప్పుడూ కొట్టొద్దని."

"అలా అయితే నేను చచ్చిపోతాను."

ఆ మాట సూటిగా వెళ్ళి వెంకట్రావు గుండెకు తగిలింది.

"సరే వద్దులే" అన్నాడు కుర్రాడి చేతిని పట్టుకుంటూ.

"నీ పేరేంటి?" అడిగాడు కుర్రాడు.

"వెంకట్రావు!"

"వెంకట్రావ్! నేను మీ ఇంట్లోనే ఉంటాను. ఉండనా!"

నవ్వొచ్చింది వెంకట్రావుకి. తన ఇల్లు - అవునూ! తనకి ఇ ల్లెక్కడుంది? ఎన్నేళ్ళ క్రితం ఆ ఊరు వచ్చాడో తనకే తెలీదు! అప్పటి నుండి బస్టాండునే నమ్ముకుని బ్రతుకుతున్నాడు. పగలంత మూటలు మోయడం. రాత్రి బస్ షెల్టర్‌లో పడుకోవడం. ఆ జీవితం తనకు అలవాటైపోయింది. ఇవాళ తనకు తోడు ఈ కుర్రాడు. అయినా అంతకుముందు ఆలోచించలే దీ విషయం. కుర్రాడు రాత్రి ఎక్కడుంటాడు?

"మాట్లాడ వేం?" అన్నాడు కుర్రాడు.

"నాకు ఇల్లు లేదు. బస్టాండులోనే పడుకుంటాను" అన్నాడు వెంకట్రావు. ఆ మాట అంటుంటే ఎందుకో సిగ్గుగా అనిపించిం దతనికి.

"నేనూ నీతోనే పడుకుంటాను" అన్నాడు కుర్రాడు.

"నాతోనా?" అన్నాడు వెంకట్రావు. అయినా ఈ రాత్రి కిక చేసే దేముంది? "సరే" అన్నాడు చివరికి.

"వాష్ బేసిన్ ఎక్కడుంది?" అడిగాడు రాజు.

"అంటే?" అడిగాడు వెంకట్రావు అర్థం కాక.

"అంటే చేతులు కడుక్కుంటారు చూడు! అదీ!"

ఎప్పుడో పట్నం హోటల్లో చేతులు కడుక్కునేందుకు కొళాయి ఉన్న తొట్టిని చూసిన జ్ఞాపకం మెదిలింది వెంకట్రావులో.

"ఇక్కడ అలాంటివి ఉండవు బాబూ! దీన్లోనే కడుక్కో" అన్నాడు ప్లేటుని చూపిస్తూ.

ప్లేట్లో చేతుకులు కడుక్కుంటూ అన్నాడు రాజు

"నువ్వు చాలా మంచివాడివి! మా మమ్మీ ఒకసారి ప్లేట్లో చేతులు కడిగానని బాగా తిట్టింది తెలుసా!"

తెలీదన్నట్లు త లూపాడు వెంకట్రావు. ఇద్దరూ హోటల్లోంచి బయటికొచ్చారు. బస్టాండు నిర్మానుష్యంగా ఉంది. అంతక్రితం తెరిచి ఉన్న కిళ్ళీ కొట్టు మూసేశారు.

దూరంగా ఉన్న మర్రి చెట్టు ఆకులు గాలి కెగురుతూ వచ్చి నేల రాలుతున్నాయి. కరెంటు స్తంభం కింద పడుకున్న కుక్క అటూ ఇటూ పొర్లుతోంది.

ఇద్దరూ బస్సు షెల్టర్ దగ్గరి కొచ్చారు. భుజం మీద తువ్వాలు తీసి నేలను శుభ్రం చేసి పరుస్తూ అన్నాడు వెంకట్రావు - "పడుకో బాబూ!"

కుర్రాడు క్షణం తటపటాయించి తువ్వాలు మీద పడుకున్నాడు. వెంకట్రావు వాడి పక్కనే పడుకున్నాడు.

"వెంకట్రావ్! నీకు కథలొచ్చా!" అడిగాడు కుర్రాడు.

"వచ్చు! ఏం?"


"నాకు కథ చెప్పవా?"

"నీకు రోజూ మీ ఇంట్లో కథలు చెప్తారా?" అడిగాడు.

"ఊహుఁ చెప్పరు! నా క్లాసు కుర్రాళ్ళందరూ ప్రతిరోజూ వాళ్ళ మమ్మీయో, డాడీయో, తా తయ్యో కథలు చెప్తారని అంటుంటే నాకు ఏడుపొస్తుంది వెంకట్రావ్! మా మమ్మీ, డాడీ కథ చెప్పమంటే తిడతా రు."

వెంకట్రావ్‌కి చిన్నతనం జ్ఞాపకం వచ్చింది. తండ్రి ఒళ్ళో కూర్చోబెట్టుకుని రోజూ కథలు చెప్పేవాడు. తనెంతో శ్రద్ధగా, ఆప్యాయంగా వాటిని వినేవాడు. ఇక్కడ కథలు చెప్పడం, చెప్పకపోవడం అనేది కాదు ముఖ్యం. తనవా ళ్ళనుకునే మనుషులే కొంత సమయాన్ని తన కోసం వినియోగించడంలో దొరికే తృప్తి. ఆ భావం మానసిక ఎదుగుదలకు ఎంతో సహాయపడుతుంది. బాల్యం గుర్తుకురాగానే అతని మనసు చిత్రమైన అనుభూతికి లోనైంది.

కథ చెప్పడం ప్రారంభించాడు. తరువాత ఇంకో కథ. నాలుగో కథ పూర్తవుతుండగా అంతవరకూ 'ఊ' కొడుతున్న కుర్రాడు నిద్రలోకి జారుకున్నాడు. వెంకట్రావు కూడా నిద్రావస్థను చేరుకున్నాడు.



మబ్బుల్ని చీల్చుకుని బయటి కొచ్చిన చంధ్రుడు చల్లని వెన్నెల్ని కురిపిస్తున్నాడు. తెరలా జారుతున్న మంచు మర్రి ఆకులమీద బిందువుల్లా పేరుకొని వీథి దీపపు కాంతిలో మెరుస్తోంది. రోడ్డు పక్క పడుకున్న కుక్క చలికి ముణగదీసుకుని, నిద్రలో వణుకుతోంది.

ఏదో శబ్దం వినిపించి వెంకట్రావుకి తెలి వొచ్చింది. కళ్ళు తెరిచి చూశాడు - పక్కన పడుకున్న కుర్రాడు మేలుకుని కూర్చొని ఏడుస్తున్నాడు.

"ఎందుకు ఏడుస్తున్నావు రాజా!" అడిగాడు వెంకట్రావు.

"చలేస్తోంది" అన్నాడు కుర్రాడు.

బాగా వణుకుతున్నాడు. ఆ వణుకు వెంకట్రావుకు స్పష్టంగా కనిపిస్తోంది.

అతని మనసు చివుక్కుమంది. గదిలో వెచ్చగా దుప్పట్ల ముసుగులో నిద్రపోవలసిన వాడు బికారిలాంటి తన దగ్గర చేరి చలికి బాధపడుతున్నాడు.

"దుప్పటి కావాలి" అన్నాడు కుర్రాడు.

ఒక జత బట్టలు, [అవి అతని ఒంటిమీద ఉన్నాయి] తువ్వాలు తప్ప ఇంకేం లేవు వెంకట్రావుకి. కొద్దో, గొప్పో మిగిలిన చిల్లర డబ్బులు కిళ్ళీకొట్టు వాడి దగ్గర దాచుకుంటాడు. అతన్ని చలి ఎప్పుడూ బాధించలేదు. ఏ వాతావరణంలోనైనా సర్దుకుపోయే తత్వం అతని శరీరానికి పరిస్థితులవల్ల వరంగా వచ్చిం దేమో!

ఇప్పుడు ఈ కుర్రాడి చలిని ఎలా పోగొట్టడం.

కుర్రాడు గజగజా వణుకుతున్నాడు. భరించలేనట్లు ఏడుస్తున్నాడు.

చుట్టూ చూశాడు వెంకట్రావు. ఏ సాధనమూ అతనికి కనిపించడంలేదు. పోయి అడిగి తెద్దామన్నా అతని పరిచయస్థులు ఎవరూ ఆ దగ్గర్లో లేరు.

"వెంకట్రావ్! చలేస్తోంది" అంటున్నాడు కుర్రాడు.

బస్టాండంతా పరికిస్తున్న వెంకట్రావు కళ్ళు కిళ్ళీకొట్టు మీద నిలిచాయి. దాని ముందు ఎండ పడకుండా అమర్చి ఉన్న డేరాలాంటి టార్పాలిన్ గుడ్డ అతనికి కనిపించింది.

వెళ్ళి దాన్ని ఊడదీసి తెచ్చి కుర్రాడికి కప్పాడు. దాన్లో దూరి ముడుచుకు పడుకున్నాడు కుర్రాడు - ఒక చేత్తో వెంకట్రావు చేతిని పట్టుకుని.

వెంకట్రావు కూడా పడుకున్నాడు. కుర్రాడి చేతిలో అతని చేయి ఉంది. ఆ కుర్రాడి పట్ల ఎందుకో తెలియని ఆప్యాయత కలిగింది. రెండో చేత్తో కుర్రాడి తల నిమురుతూ ఉండిపోయాడు. ఆ రాత్రి అతను నిద్రపోలేదు.

** ** **

"ఎవర్రా ఈ కుర్రాడు?" అడిగాడు కిళ్ళీ కొట్టువాడు.

క్రితం రోజు జరిగిం దంతా చెప్పాడు వెంకట్రావు.

"చిత్రంగా ఉందే! వాడి అమ్మా, బాబూ వస్తే ఏం చేస్తావు?"

నవ్వాడు వెంకట్రావు. "నా కేం ఇల్లా? సంసారమా? నాలాంటి అణాకాడీగాడి దగ్గర ఉండాల్సిన కుర్రాడు కాద్రా ఆ బాబు. ఇవాళో, రేపో వాడి తాలూకు మనుష లొస్తారు! తీసుకెళ్తారు! అంతదాకా నా దగ్గరే ఉండనీ!" అన్నాడు.

కుర్రాడు ఇ వేం పట్టనట్టు వెంకట్రావు కొనిచ్చిన బంతితో ఆడుకుంటున్నాడు.

"విశాఖ పట్నం నుండి ఎలా వచ్చాడో చెప్పాడా?"

"ఆ! బస్టాండు కొచ్చి నిలబడ్డాట! - జేబులో అయిదు రూపాయలు ఉన్నాయట! ఇంతలో వాళ్ళ నాన్న వస్తూ కనబడితే, గబుక్కున బస్సెక్కాడట. కండక్టరు టిక్కెట్టు అడిగితే పక్కనున్నవాడు మనూరికి టిక్కెట్టు కొన్న సంగతి గుర్తొచ్చి ఇక్కడికే టిక్కెట్టు కొని దిగిపోయాడు.

"పాపం! ఏ అమ్మ కొడుకో గానీ ముద్దొస్తున్నాడు" అన్నాడు కిళ్ళీకొట్టువాడు.

ఆ రోజంతా చిత్రంగా గడిచింది వెంకట్రావుకి. అంతకుముందు అతనికి ఎవరి గురించీ పట్టించుకునే అవసరం కలగలేదు. కానీ ఇప్పుడు కుర్రా డొక డున్నాడు. క్షణం తీరికైతే వాడితో మాట్లాడుతూ కూర్చునేవాడు. దాచుకున్న డబ్బుతో ఒక దుప్పటి కొన్నాడు. పడుకోడానికి హొటల్ వాళ్ళ పెర్మిషన్ కూడా సంపాదించాడు.

రాత్రి భోజనం చేసి వచ్చాక అడిగాడు కుర్రాడు - "వెంకట్రావ్! సినిమాకి వెళ్దామా?"

"సినిమాకా?" ఆశ్చర్యంగా అన్నాడు వెంకట్రావు.

"అవును! నే నెప్పుడూ టీ.వీ.లోనూ, వీడియోలోనూ తప్ప మామూలు సినిమా చూడలేదు తెలుసా! చదువు మానేస్తానేమో నని టీ.వీ. దగ్గరకు రానిచ్చేది కాదు మా అమ్మ."

"అలాగే తప్పకుండా వెళ్దాం" అన్నాడు వెంకట్రావు.

ఇద్దరూ కలిసి సినిమా చూశారు. తిరిగి బస్టాండు కొస్తుంటే అన్నాడు కుర్రాడు - "సినిమాలో చూపించారు గుర్తుందా? అంత ఇల్లుంటుంది మాది."

"నిజంగా?" అడిగాడు వెంకట్రావు నమ్మలేనట్లు.

"అవును! మా ఇంట్లో ముగ్గురు పనివాళ్ళున్నారు. ఎవరూ మంచివాళ్ళు కాదు. మా డ్రయివరు అసలు మంచోడు కాడు. నన్ను కారు మీద ఊళ్ళోకి తీసుకెళ్ళమంటే తంతా నంటాడు.'


"మీకు కారుందా?"


"నీకు తెలీదా? చెప్పలేదు కదూ! పెద్ద కారుంది" అని వెంకట్రావుకి అర్థం కాని ఓ కంపెనీ పేరు చెప్పాడు.

ఆ కుర్రాడ్ని చూస్తుంటే తొలిసారిగా భయం కలిగింది వెంకట్రావుకి. బాగా డబ్బున్న కుర్రాడు. తన దగ్గరకొచ్చి చిక్కుకున్నాడు. వీడి అమ్మకి, నాన్నకి తెలిస్తే ఎత్తుకెళ్ళాడని తనను ...? ఆ భయానికి అతనికే నవ్వొచ్చింది. తను త ప్పేం చెయ్యలేదు కదా!

ఇద్దరూ బస్టాండు దగ్గర హొటల్లో నిద్రపోయారు.

మర్నాడు పేపర్లో రాజు ఫొటోతోపాటు 'కనబడుట లేదు' అన్న ప్రకటన పడింది.



"వెంకట్రావూ! ఇదిగో!" అని చూపించాడు కిళ్ళీకొట్టు యజమాని.

ఆ ప్రకటన క్రింద రాజు తండ్రి అడ్రస్ ఉంది.

"ఆ అడ్రస్‌కి ఉత్తరం రాయాలి" అన్నాడు వెంకట్రావు.

"కవరు కొని రాసిపడేద్దాం."

"కుర్రాడికి తెలియనివ్వొద్దు" అన్నాడు వెంకట్రావు.

"అలాగే" అన్నాడు కిళ్ళీకొట్టు యజమాని.

నిజానికి ఆ కుర్రాడు తల్లిదండ్రుల ప్రసక్తి లేకుండా సుఖంగా తిరుగుతున్నాడు. వెంకట్రావుకి కూడా వాడిని వదలా లనిపించడం లేదు. కానీ తనలాంటి గాలిమనిషి దగ్గర వా డేం బ్రతుకుతా డు?

ఆ రోజు ఉత్తరాన్ని పో స్టు చేసేశాడు. చేస్తుంటే ఏదో తెలియని బాధ.

నిర్లిప్తంగా సాగిపోతున్న తన జీవితంలోకి తొలిసారిగా అడుగుపెట్టిన చిన్నారి అతిథి ఆ కుర్రాడు. వాడిలో తను స్నేహితుడ్ని బంధువును చూసుకుంటున్నాడు. ఎందుకు కలుస్తారో, ఎలా కలుస్తారో తెలియని మనుషులు అంత సులభంగానూ విడిపోతుంటారు. అతనికి ఏ పనీ చెయ్యా లనిపించడం లేదు. రెండు రోజుల పరిచయంలో కుర్రాడు తన కెంతో దగ్గరయ్యాడు. ఎన్నో ఏళ్ళ సంబంధం ఉన్నవాడిలా "వెంకట్రావూ!" అని పిలుస్తూ వెనకాలే తిరుగుతుంటే కలిగిన అనుభూతి తనకు దూర మవబోతోంది. అయితే. ఇంకో దారి లేదు. కొన్ని కలయికలకు విడిపోవడమంత మంచి ముగింపు మరోటి దొరకదు.

ఆ ఆలోచనల్లోనే రెండ్రోజులు గడిచాయి. కుర్రాడు తనదగ్గర ఉన్నాడనే ఆనందం కన్నా దూర మవుతా డనే దిగులే మరింత బాధించింది వెంకట్రావుని.

** ** **

"నీ పేరేనా వెంకట్రావు?" అడిగాడు కార్లోంచి దిగిన వ్యక్తి.

"అవునండీ! మీరు ...."

"రాజు మా అబ్బాయి" అంది ఒకామె అదే కార్లోంచి దిగుతూ.

"ఉత్తరం వ్రాసింది?"

"నేనే"

కిళ్ళీకొట్టు యజమానితో మాట్లాడుతున్న రాజు వాళ్ళని గమనించలేదు. రాజు తల్లి వేగంగా వెళ్ళి వాడిని అందుకోబోయింది. ఆమెను చూడగానే పరుగెత్తి వెళ్ళి వెంకట్రావు వెనుక చేరుతూ అన్నాడు రాజు - "నేను రాను మమ్మీ! ప్లీజ్! నేను రాను."

"రాజూ! ఏమి టా మాటలు!" అన్నాడు తండ్రి కసురుతూ.

"వెంకట్రావ్! నేను వెళ్ళను" అన్నాడు ఏడుస్తూ కుర్రాడు.

"ఒక్క నిముషం!" అని "రాజూ! ఇలా రా!" అన్నాడు వెంకట్రావు. మంతముగ్ధుడిలా అతన్ని అనుసరించాడు రాజు.

కొంత దూరం నడిచి ఆగి అన్నాడు వెంకట్రావు. "మీ అమ్మా నాన్నా వచ్చారు! వాళ్ళతో ఇంటికి వెళ్ళిపో బాబూ!"

"నేను వెళ్ళను!"

"ఎందుకని?"

"వాళ్ళు నన్ను కొడతా రు!

"నేను చెప్తానుగా! ఇంకెప్పుడూ కొట్టరు" అన్నాడు వెంకట్రావు.

"అయినా వెళ్ళను" అన్నాడు కుర్రాడు. "నాకు వాళ్ళు రాత్రిపూట కథలు చెప్పరు. అసలు రోజూ ఒక అరగంటైనా నాతో ఉండరు. వాళ్ళతో నేను వెళ్ళను. నీ దగ్గరే ఉంటాను."

వాళ్ళ వెనుక నిలబడి వింటున్న రాజు తండ్రి ముఖం తెల్లగా పాలిపోయింది.

"నా దగ్గర ఉంటే ను వ్వెలా చదువుకుంటావు? పెద్దయ్యాక నాలా మూటలు మోస్తూ బ్రతుకుతా వా? చెప్పు" అన్నాడు సౌమ్యంగా.

కుర్రాడు మాట్లాడలేదు.

"మీ అమ్మకు, నాన్నకు చెప్తాను నీకు రోజూ కథలు చెప్పమని, మరి నువ్వు ఇంటికెళ్ళి బాగా చదూకోవాలి. వెళ్తావా? లేకపోతే నీతో మాట్లాడను."

"అవును బాబూ! ని న్నెప్పుడూ ఏమీ అనను" అన్నాడు తండ్రి.

అయిష్టంగానే త లూపాడు కుర్రాడు.

రాజును తల్లికి అప్పగించేసి, అతని తండ్రితో "మీతో కొంచెం మాట్లాడాలి బాబూ!" అన్నాడు వెంకట్రావు.

"ఏమిటీ?" అన్నాడు రాజు తండ్రి.

"పిల్లలు పెద్ద చదువులు చదవాలని, ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలని మీ కుండటం తప్పు కాదు బాబూ! అయితే వాళ్ళకు ఆ విషయం కొట్టడం, తిట్టడం చేసి చెప్పడం తప్పు. రోజూ అరగంటైనా తనతో గడపని తల్లిదండ్రుల్ని ఆ కుర్రాడు వద్దంటున్నా డంటే, అతనికి ఈ వయసులో మీతో గడపడం ఎంత అవసరమో ఆలోచించండి. ప్రతి రాత్రీ ఒక అరగంట కథలు చెప్పడమో, కబుర్లు చెప్పడమో, ఎటైనా షికారుకు తీసుకెళ్ళడమో మీరు చేసి ఉంటే, బస్టాండులో మూటలు మోసే నాతో ఉండిపోతా నని చెప్పేవాడు కాదు. రాత్రి చలికి వణికి టార్పాలిన్‌లో తలదాచుకునే పరిస్థితీ ఉండేది కాదు. మీకు చెప్పగలిగే వాడిని కాదు. తప్పైతే క్షమించండి!"

"అర్థమైంది" అన్నాడు రాజు తండ్రి ఇం కేం మాట్లాడలేక. జేబులోంచి కొంత డబ్బు తీసి ఇస్తూ "ఇదుంచు" అన్నాడు.

"వద్దు బాబూ! ఇన్నాళ్ళూ ఏ తోడూ లేకుండా బ్రతికిన నాకు మీ కుర్రాడు ఉన్న నాలుగురోజులూ గడిపిన క్షణాలు తలుచుకుంటే అదే పెద్ద బహుమానం. ఉంటాను" అన్నాడు వెంకట్రావు.

కారు బయలుదేరింది. రాజు కిటికీలోంచి చెయ్యూపాడు. వెంకట్రావు కూడా సమాధానంగా చేతిని గాల్లో కదిపాడు. అతని కంట్లో కదిలిన నీటి పొర దూరంగా పోతున్న కారును కనబడనీయటం లేదు. తనకు ప్రియమైన వస్తువును ఎవరో దోచుకుపోతున్న భావం. ఆ కుర్రాడు తనని మరుసటిరోజే మరిచిపోవచ్చు. కానీ తన జ్ఞాపకాన్ని జీవితకాలానికి సరిపడేట్లు మిగిల్చేసి వెళ్ళాడు.

"ఎంకట్రావ్! బస్సొచ్చింది రారా!" వెనుకనుండి పిలుపు వినబడింది. కన్నీటిని తుడుచుకుని వెనక్కు తిరిగాడు వెంకట్రావు - తన మామూలు జీవితంలోకి మళ్ళీ ప్రవేశించడానికి!!! ★

